# సత్యకాముని కథ

ఈ కథ ఛాందోగ్యోపనిషత్తునుండి. ఛాందోగ్యము సామవేదోపనిషత్తు. ప్రతివేదమును ముఖ్యముగా రెండు భాగములు :

1. సంహిత (మంత్రములు)
2. బ్రాహ్మణము (ఆ మంత్రముల స్వరూపము, ప్రయోజనమును వివరించునది).

బ్రాహ్మణమునందు ఉపభాగములున్నవి. అందు ఉపనిషత్తు ఒక ఉపభాగము. ఉపనిషత్తు, ఈ సృష్టి మూల కారక శక్తి తత్త్వమును విచారించును. ఆ శక్తికి వేద మిచ్చిన పేరు బ్రహ్మ. బ్రహ్మయనగా చాల పెద్దదైనది (macro cosmic force). అనంతమైన ఈ బ్రహ్మశక్తిని వేదము బహువిధములుగా వివరించి విదితము సేయును. ఉపనిషత్తులందు ఆ శక్తికిని మనకును ఉన్న సంబంధము, ఉండవలసిన సంబంధము – దాని ప్రయోజనములు గూడ వివరింపబడును.

ఈ ఉపనిషత్తులు ఏ ఉపనిషత్తునకా ఉపనిషత్తుగా చదువు కొనవచ్చును. అయినను, ఆ ఉపనిషత్తు ఏ వేదమునకు సంబంధించినదో, ఆ వేదమన్త్రార్థములతోడ అన్వయించినచో, వానిలోని భావములు మరియు విశదమగును.

ఈ సృష్టి నిరంతరమైన క్రియ. వేదమా సృష్టి వ్యాఖ్యాన గ్రంథమగుట జేసి, ఆ మహానంతక్రియా వైవిధ్యము, ఆ సకలక్రియా సమూహకర్తల (subjects) ప్రవృత్తి (nature), ఆ క్రియా ఫలితములననుభవించు కర్మ స్వరూపుల (objects), వ్యాపారమును విశదముగా వర్ణించును. ఈ కర్త, కర్మ, క్రియా వ్యాఖ్యాన రూపములయిన మంత్రముల నుండియే వ్యాకరణ శాస్త్ర (grammar) ముద్భవించినది. సామవేదము ప్రధానముగా కర్మ (object) స్వరూపములైన మనలను గూర్చి విచారించును. కర్త – ఆ బ్రహ్మశక్తి. ఆ శక్తిని చూచుట ఎట్లు? తెలుసుకొనుట ఎట్లు? దాని వలన ఏమి ఫలితములు మనలను పొందును? వీటిని గూర్చి చర్చించునది సామవేదము. ఈ కథ ఆ బ్రహ్మ పదార్థమును గురించి.

ముందుగా ఈ కథను ఉపనిషత్తులో నున్నట్లు యథాతథముగా జెప్పి, పిమ్మట కథను గూర్చి విచారింతము. ఒకానొకప్పుడు జాబాలుడైన (జబాలాదేవి తనయుడైన) సత్యకాముడు తల్లి జబాలాదేవి వద్దకేగి, భవతీ! (పూజ్యురాలా!) నేను బ్రహ్మచర్య స్థితిని పొందదలచితిని. నా గోత్రమేమి? అని అడిగెను, ఆమె తండ్రీ! నేనది చెప్పలేను. నేను పరిచారిణిగా అనేక కార్యములు చేసితిని. నీవు నా యౌవనమునందు లభించితివి. నేను చెప్పలేను. నా పేరు జబాలాదేవి. నీవు సత్యకాముడవు. అందువలన సత్యకామజాబాలుడను. అని చెప్పుకొనుము, అనెను.

అతడు హారిద్రుమతుడును (హారిద్రుమతం) గౌతముడును (గౌతమం) అయిన వానివద్దకేగి, భగవన్! (పూజ్యుడా!) బ్రహ్మచర్యమునందుండ నిశ్చయించి, భగవంతులయిన మిమ్ము నాశ్రయింప వచ్చితిననెను. ఆయన సౌమ్యుడా! నీ గోత్రమేమి? అని అడిగెను. ఆర్యా! నాకది తెలియదు. మా తల్లి నడిగితిని. ఆమె చెప్పినది నేను పరిచారిణిగ అనేక కార్యములు జేసితిని. నా యౌవనమునందు నీవు లభించితివి. నేను చెప్పలేను. నా పేరు జబాలా దేవి. నీవు సత్యకాముడవు, దానజేసి నేను సత్యకామ జాబాలుడను, అని అతడు విన్నవించెను. ఆయన బ్రహ్మ భావ నేచ్ఛలేనివాడు ఇట్లు పలుకలేడు. సౌమ్యుడా! సమిధలను తెమ్ము. నీకు దీక్ష నిచ్చెదను. నీవు సత్యమును దాటలేదు. (న అగాః) అని పలికిదీక్షనిచ్చి, బక్కచిక్కి, మిక్కిలి కృశించిన నాలుగువందల గోవులను ఏరి, సౌమ్యుడా! వీనిని అనుసరింపుము (అనుసంవ్రజ) అనెను. వానిని తోలుకొని పోవుచు, సత్యకాముడు ఇవి సహస్రమయ్యేడు దాక తిరిగి రాను, అని నిశ్చయించి, అవి సహస్రముగా వృద్ధినొందువరకు అనేక వత్సరములు ప్రవాసిగా నుండెను.

## ఇది చతుర్థకండము

ఋషభమప్పుడాతనిని పలుకరించెను. సత్యకామా! అతడు : భగవః ఋషభము : సౌమ్యుడా! మనము వేయి మందిమయితిమి. అచార్యకులమును జేర్చుము. బ్రహ్మ పదార్థము యొక్క పాదమును గూర్చి కూడ చెప్పదలచితి. అతడు : భగవాన్! నాకు చెప్పవలసినది. ఋషభము పలికినది. తూర్పు దిక్కు కళ. సౌమ్యుడా! ఈ చతుష్కలావతం సమైన పాదముతోడ బ్రహ్మపదార్థమునకు ప్రకాశవంతమని పేరు. ఏ విద్వాంసుడు (తెలిసిన వాడు) చతుష్కలావతం సమైన పాద (భాగము) కలితమైన బ్రహ్మ పదార్థమును ప్రకాశవంతమైనదిగ భావించి ఉపాసించునో, ఆయన ఈ లోక మునందు ప్రకాశవంతుడగును. ఏ విద్వాంసుడు చతుష్కలావతంసమైన పాదకలితమైన బ్రహ్మ పదార్థమును ప్రకాశవం తమైనదిగ భావించి ఉపాసించునో, ఆయన ప్రకాశమయమయిన లోకములను జయించును.

## ఇది పంచమఖండము

అగ్ని నీకు పాదమును గూర్చి చెప్పును.

మరునాటి ప్రొద్దున అతడు గోవులను సుస్థాపనమయిన (ఉండుటకు యోగ్యమయిన) స్థలమునకు బోవ ననుజ్ఞ నిచ్చె. సాయంకాలమున ఆ గోవులు కూడిన చోట, అగ్ని నాయత్తముచేసి, గోవులను కట్టి, అగ్నిదేవుని సమిధలతోడ నర్చించి, అగ్నిముందు, తాను వెనుకగా, తూర్పుదిక్కు ముఖముగా నాసీనుడయ్యెను.

అగ్ని పలుకరించెను. సత్యకామా! అతడు : భగవః ! సౌమ్యుడా ! బ్రహ్మపదార్థ పాదమును గూర్చి చెప్పదల చితిని. భగవాన్! నాకు చెప్పవలసినది. పృథ్వి కళ : అంతంక్షము కళ : స్వర్గము (ద్యౌః) కళ : సముద్రము కళ : సౌమ్యుడా! ఈ చతుష్కలావతంస పాదమైన బ్రహ్మమునకు అనంతమని పేరు. ఏ విద్వాంసుడు ఈ విధముగా చతు ష్కలావతంసమైన పాదవంతమైన బ్రహ్మమును అనంతమని ఉపాసించునో, ఆయన ఈ లోకమున అనంతుడగును. ఈ చతుష్కలావంతమైన పాదకలితమైన బ్రహ్మమును అనంతముగ భావించి, ఉపాసించిన విద్వాంసుడు అనంతమైన లోక ములను జయించును.

## ఇది షష్ఠఖండము

హంస నీకు పాదమును గూర్చి చెప్పును.

మరునాడు ప్రొద్దున అతను గోవులను సుస్థాపన మయిన స్థలమునకు బోవననుజ్ఞనిచ్చెను. సాయంకాలమా గోవులు కూడినచోట, అగ్ని నాయత్తము జేసి, గోవులను కట్టి, అగ్ని దేవుని సమిధలతో నర్చించి,అగ్ని ముందు, తాను వెనుకగా తూర్పుదిక్కు ముఖముగా నాసీనుడయ్యెను. హంస ఎగిరివచ్చి పలుకరించెను. సత్యకామా! అతడుః భగవః! బ్రహ్మము యొక్క పాదమును గూర్చి చెప్పదలచితిని. భగవాన్! నాకు చెప్పవలసినది. హంస పలికినది. అగ్ని కళ; సూర్యుడు కళ; చంద్రుడు కళ; విద్యుత్తు కళ. సౌమ్యుడా! ఈ చతుష్కలావంతమైన పాదకలితమైన బ్రహ్మమునకు జ్యోతిష్మంతమని పేరు. ఏ విద్వాంసుడు ఈ విధముగా చతుష్కలావతంసమైన పాదకలితమైన బ్రహ్మమును జ్యోతిష్మంతముగా నుపాసించినో, ఆ విద్వాంసుడీ లోకమున జ్యోతిష్మంతుడగును. ఈ చతుష్కలావతంసమైన పాదకలితమైన బ్రహ్మమును జ్యోతిష్మంతముగ నుపాసించిన విద్వాంసుడు జ్యోతిష్మంతమైన లోకములను జయించును.

## ఇది సప్తమఖండము

మదుగు పక్షి నీకు పాదమును గూర్చి చెప్పును.

మరునాడు ప్రొద్దున అతడు గోవులను సుస్థాపనమయిన స్థానమునకు బోవ ననుజ్ఞనిచ్చెను. సాయంతనమా గోవులు కూడిన చోట నగ్ని నాయత్తము జేసి, గోవులను కట్టి, అగ్ని దేవుని సమిధలతో నర్చించి, అగ్ని ముందు, తాను వెనుకగా, తూర్పు దిక్కు ముఖముగా నాసీను డయ్యెను.

మదుగు ఎగిరి వచ్చి పలుకరించెను. సత్యకామా! అతడు : భగవః! సౌమ్యుడా! బ్రహ్మపదార్థ పాదమును గూర్చి చెప్పదలచితిని. భగవాన్! నాకు చెప్పవలసినది. ప్రాణము కళ; చక్షువులు కళ; శ్రోత్రము (చెవి) కళ; మనస్సు కళ; సముద్రము కళ; ఈ చతుష్కలావంతమైన పాదకలితమైన బ్రహ్మమునకు ఆయతనమని పేరు. (ఆయతనమనగా వసతి) ఈ విధముగా చతుష్కలాంచిత పాదయుతమైన బ్రహ్మమును ఏ విద్వాంసుడు ఆయతనవంతముగా నుపాసించునో, ఆయన ఈ లోకమున ఆయతనవంతుడగును. ఈ చతుష్కలాంచిత పాదకలితమైన బ్రహ్మమును ఆయతనవంతమైనదిగ ఉపాసించిన విద్వాంసుడు ఆయతనమైనలోకములను జయించును.

## ఇది అష్టమఖండము

అతడు ఆచార్యకులమును (ఇల్లు) జేరెను. ఆచార్యుడు సత్యకామా! అతడు : భగవః! సౌమ్యుడా! బ్రహ్మవిదునివలె (బ్రహ్మమును గూర్చి తెలిసిన వానివలె) భాసించు (ప్రకాశించు) చున్నావు. నిన్ను ఎవరు అనుశాసించిరి? (బోధించిరి?) అతడు : బోధపరచినది మానవులు కారు. భగవః మీరు మాత్రమే చెప్పవలెనని నా కోరిక. ఆచార్యుని నుండి విదితమైన విద్య వలననే సాధిష్ఠప్రాప్తి (సకల శ్రేయస్సు) కలుగునని మీ వంటి భగవత్సదృశుల వలన వింటిని. ఆయన దానినే చెప్పెను. కొంచెము గూడ మార్పులేదు.

**ఇది నవమఖండము**

తరువాత కొంతకాలమునకు, ఉపకోసలకామలాయనుడు (కామలాదేవి కుమారుడైన ఉపకోసలుడు) బ్రహ్మ చర్యస్థితిని పొందుటకుసత్యకామ జాబాలుని వద్ద కేతెంచెను. (ఉపకోసలునిది వేరొక కథ).

ఈ కథ తెలియవలెననినచో, బ్రహ్మచర్యస్థితి, గోత్రము, సత్యము, సత్యకాముడు, బ్రహ్మము, పాదము, ప్రకాశము, అనంతము, జ్యోతిష్మంతము, ఆయతనము వంటి కథలోని శబ్దములను గూర్చి విచారింపవలెను గదా!

బ్రహ్మచర్య స్థితి : బ్రహ్మచర్య శబ్దమునకు లోకసామాన్యమైన అర్థమందరెరిగినదే. వివాహమునకు పూర్వమైన స్థితి. కాని, వేదము నందు మరియొక అర్థము గూడనున్నది. చర్య అనగా, తిరుగుట, గతి, గమనము, నడవడి, బ్రహ్మచర్యమనగా, బ్రహ్మపదార్థము యొక్క నడవడి, తీరు. అనగా బ్రహ్మస్వరూపమని భావము. ఆ బ్రహ్మ లక్షణములను, నైజమును గురించిన ఊహగానుండుట బ్రహ్మచర్యస్థితి. అనగా దానిని గూర్చి తెలిసికొను వ్రతము నందుండుట. తాత్పర్యము బ్రహ్మను గూర్చి తెలిసికొనుట.

గోత్రము : గోత్రమనగా ఋషిసంతతి. వేదమభ్యసించుటకేగినచో, గురువు మీది ఏవేదమని అడుగును. వ్యాసము నీంద్రునకు పూర్వము, వేదమును సంపూర్ణముగ పఠించుటయో, అర్థమును గ్రహించుటయో ఆచారముగ నుండెడిది. వేదము నాలుగు భాగములుగా విభజింపబడినతరువాత, ప్రజాపతి సంతానమైన ప్రజలను నాలుగు శాఖలుగ విభజించి ప్రతి శాఖవారును, తమకు నిర్ణయింపబడిన వేదమును ప్రథమమునపఠించుటను గాని, అర్థము నెరుగుట గాని జేసి తీరవలెననియు నిర్ణయింపబడినది. కనుక, గురువు శిష్యుని స్వశాఖవేదమెరిగి, దానితో అధ్యయన మారంభించి, తరువాత తక్కిన మూడు వేదములు పఠింపించును. వేదాధ్యయనమునకు గాక, బ్రహ్మవిద్య కొఱకేగినచో నీగోత్రమేమి యని యడుగును. బ్రహ్మవిద్య వేదమందంతయు నిండి యుండును. వేదమును ప్రథమమున వినిన ఋషులు, వారి శిష్యులకు, వేదాధ్యయనమేగాక, వలసిన వారికి బ్రహ్మవిద్యను గూడ బోధించిరి. ఈ గురుశిష్య పరంపరవలన, వేదాధ్యయనము నందే గాక, బ్రహ్మవిద్యా విచారము నందుగూడ, సంప్రదాయములు, శాఖలు ఏర్పడినవి. తమ పూర్వీకులు, ఏ ఋషి బృందమునుండి బ్రహ్మవిద్య నేర్చిరో, ఆ ఋషివరేణ్యుల నామములను స్మరించు సంప్రదాయమా వంశమునందు పరంపరగా వచ్చి, అది గోత్రమైనది. కావున గోత్రమనగా ఋషి సంతతి. వారి వంశము నందు ప్రథమముగా బ్రహ్మవిద్య ఆ ఋషులనుండి వచ్చినది. శిష్యుడు గోత్రము చెప్పినచో, ఆచార్యుడా సంప్రదాయా నుసారముగా బ్రహ్మవిద్యను బోధించును. లేనిచో ఆ శిష్యునకు బ్రహ్మవిద్య యందు నిజమైన ఇచ్ఛ ఉన్నదో, లేదో, తెలిసికొని గాని శిష్యత్వము నంగీకరింపడు. గౌతముడు, గోత్రమెరుగని సత్యకాముని బ్రహ్మవిద్యాభిలాషను పరీక్షించి గాని దీక్షనీయ లేదు.

కావున గోత్రమేదియైనను, బ్రహ్మవిద్యాభిలాష ప్రధానమైనది. కనుకనే, ఆచార్యుని గోత్రము చెప్పబడలేదు. ఆయన హరిద్రుమతవంశీయుడు. గోతమీ పుత్రుడు. ముఖ్యముగా బ్రహ్మవిదుడు.

భవతి, భగవతి, భగవంతం, భగవాన్, భగవః ఇవి సత్యకాముడు తల్లిని, గురువును, బ్రహ్మలక్షణములను వివరించిన వృషభము, అగ్ని, హంస, మదుగుపక్షులను పలుకరించినపుడు అనిన మాటలు. భవము, భవికము, అనగా మేలు, శక్తి యను అర్థము. భగమునకు గూడ మేలు, శక్తి యనియే అర్థము. (శివునకు భవుడని పేరు) ఆ మేలు, ఆ శక్తియే బ్రహ్మము. ఆ శక్తి నెరుగుటయే బ్రహ్మవిద్య. సత్యకాముడెవరెవరిని ఆ పదములతో పిలిచెనో, వారందరును బ్రహ్మవిద్య నెరిగినవారని యర్థము.

తల్లి బ్రహ్మవిద్యావంతురాలగుటచేతనే, సత్యకాముడు, భవతీ, యని సంబోధించి, తన గోత్రమేమియని ప్రశ్నించెను. ఆమె పుత్రుని గోత్రము తెలియదనినది. యౌవనమందు కంటిననినది. అనగా యౌవనమందామె బ్రహ్మవిద్య నేర్వ లేదు. అప్పుడనేక కర్మలు (చర్యలు) చేసినది. (బహ్వాహం చరంతీ – నేననేక కార్యములు చేసితిని అని అచటనున్న వేదవాక్యము) అందు బ్రహ్మచర్యమును గూర్చిన ప్రయత్నము లేదు. అప్పుడనేక విద్యలను నేర్చినది. అందు బ్రహ్మ విద్య లేదు. తల్లి, శిశువుగర్భస్థముగ నుండు వరకెంత జ్ఞానముతో నుండునో, శిశువంతటి జ్ఞానపాసనతోడనే ఉద్భ వించును. ఆ పైన తన జన్మలో స్వశక్తి కొలది, అధికమైన జ్ఞానస్థితిని పొందునన్న మాట. సత్యకాముడు జన్మించువరకు జబాలాదేవి బ్రహ్మవిద్యావిద్వాంసురాలు కాకపోవుటవలన, సత్యకాముని జ్ఞానశరీరమునందు బ్రహ్మవిద్యా వాసన లేదు. గోత్రమనగా శరీరమని కూడ అర్థమున్నది. స్థూల, సూక్ష్మ, జ్ఞానములనిన మూడు దేహములయందును, విద్యా సముపార్జనా విషయమున జ్ఞానదేహము ముఖ్యము. ఆ జ్ఞానదేహము నందుండు అన్నివిద్యలలోను, బ్రహ్మవిద్య మిన్న. ఆ విద్య ఋషిపరంపరా ప్రాప్తమైనది. అందువలన, గోత్రమనగా జ్ఞానశరీరమనియు, అందును, ఋషిపరంపరా సంప్రాప్త బ్రహ్మవిద్యా వాసనాకలిత జ్ఞానశరీరమనిన అర్థమేర్పడినది. నీ గోత్రమేమనగా, నీ జ్ఞానదేహమునందలి బ్రహ్మవిద్యా వాసనకు మూలకారకులైన ఋషులెవరని యర్థము. సత్యకామునికి తల్లి గోత్రమీయలేకపోయినను, బ్రహ్మవిద్యాభిలాష నిచ్చినది. తనలోనున్న కోరికను వ్యక్తపరచుట కొఱకే, తనయునకు సత్యకాముడని పేరిడినది. బ్రహ్మయే సత్యము. సత్యకాముడనగా బ్రహ్మకాముడని యర్థము. ఆమె కోరిక కుమారుని యందు నిజమై, సత్య కాముడు సత్య–కాముడయ్యెను. తాను యౌవనము దాటిన తరువాతగాని, సాధింపవీలుపడని బ్రహ్మవిద్యను, కుమారుడు యౌవనమందే సాధించుటకు నిశ్చయించెను. అనగా తల్లి కోరికలు గర్భమునందున్న శిశువునకు సంక్రమించునన్న మాట. కోరికలుండునది జ్ఞానదేహమునందు గాదు. మనస్సునకు స్థావరమైన సూక్ష్మదేహమున. కనుక, తల్లి, ఒక్క స్థూలదేహమునకే కాక సూక్ష్మ, జ్ఞాన దేహములకు గూడ కారణభూతురాలని తెలియుచున్నది.

తల్లి దృఢశరీరవతి అయినచో పుత్రుడు పుష్టివంతుడగుట మనమెరిగినది. పుత్రుని జీవసంపుటి (DNA molec ule) యందు తల్లి ఆరోగ్యానారోగ్యపు ఛాయలు ఉండునని జీవన శాస్త్రము (Life Sciences) చదివిన మనమందర మెరిగినదే. వేదమీ కథను చెప్పుచు, ఆ DNA కణములందు, తల్లియొక్క భౌతిక శరీర లక్షణములు మాత్రమే కాదు, సూక్ష్మ, జ్ఞాన దేహలక్షణములు గూడ ముద్రితములై ఉన్నవని తెలియజేయుచున్నది. ఆ జీవకణమునందు గూడ ఈ మూడు శరీర లక్షణములున్నవన్న మాట. అదిగూడ ఆ బ్రహ్మ కృతమే గదా!

ఇప్పుడా మాతృస్వరూపమవగాహన మగుచున్నది. తల్లినుండి పుత్రునకు భౌతిక శరీరాకారము, దాని క్రియా శక్తి, సూక్ష్మ దేహము, దాని ఇచ్ఛాశక్తి, జ్ఞానదేహము, దాని జ్ఞానశక్తి సంక్రమించుచున్నవి. ఈ అనంతమైన విశ్వమున ందు, ఈ మూడు శక్తులు నొక ఆయతనము (గూడు లేక చోటు) నందు ఒడగూర్చుటయే ఆ బ్రహ్మపదార్థము చేయు పని. ప్రాణులందా పని తల్లిరూపమున జరుగుచున్నది. ఆ బ్రహ్మ పధార్థమే తల్లి రూపమగుచున్నది. ఇట్టి శాస్త్రీయము ను, తార్కిక సమార్థమైన దృక్పథము తోడనే (Scientific and Logical view) వేదము తల్లిని దైవమనుచున్నది. ప్రపంచమునందే ఇతర మతము గానిమ్ము, పుస్తకము గానిమ్ము, తల్లిని గౌరవించుము, తల్లి మాటవినుము, తల్లి ఎడల కృతజ్ఞత చూపు మనునుగాని, తల్లిని దైవమనరు. వేదమతమొక్కటే, తల్లికిని, పరమేశ్వరునకు భేదము లేదనుచున్నది. ఈ కథ బ్రహ్మమును గూర్చి యగుటజేసి, ఆ బ్రహ్మము మాతృస్వరూపమగుటజేసి, ఆ మాతృస్వరూపమిచట వివరింప బడినది.

తల్లి బ్రహ్మప్రతిరూపమగుట చేతనే, పుత్రుడు, భవతీ, యని సంబోధించెను. పుత్రుని దృష్టినుండి, తల్లిని సాక్షాత ప్ర బ్రహ్మరూపమని చూపును. తల్లి శరీరమెంత సుస్థితిలోనున్న, సంతానమంత పిండపుష్టితో నుద్భవించును. తల్లికి ఎంత ఉన్నతమైన కోరికలున్న, పుత్రుడంత ఉన్నత ఆశయములతోడ నుద్భవించును. తల్లి ఎంత జ్ఞానవంతురాలయిన పుత్రున కంత పటిష్టమైన జ్ఞానదేహమలవడును. తన సంతానమునకీ మూడు దేహములను, తాను ఎంత ఉన్నత స్థాయిలో నీయ గలదో, అంత ఉన్నతస్థాయిలో నిచ్చుట తల్లి ధర్మము. తాను ప్రజాపతి సంకల్పమును క్రియా రూపమును చెందించు దీక్షలో నుండవలెను. ఆ కలుగబోవు సంతానమా ప్రజాపతియైన బ్రహ్మతత్వమున కెంత సన్నిహితముగానున్న, తాను తన విధినంత సక్రమముగా నిర్వర్తించినదగును. వచ్చి తల్లిని గోత్రమడుగగనే, జబాలా దేవి – అయ్యో! నేను సత్యకాముడు పుట్టుటకు పూర్వమే బ్రహ్మవిద్య నేర్చినచో, కుమారుని జ్ఞానదేహము బ్రహ్మ విద్యావాసన గలిగి మరియు పటిష్ట మయ్యేడిదికదా! నేనా పని చేయలేకపోయితిని అని విచారించినది. తాను తన మాతృత్వదీక్షను, తన శక్తి మేరకు సంపూర్ణముగ నిర్వర్తింపలేకపోతినని కించపడినది. ఆ విచారముతోడనే, ఆ చిరు ప్రసంగము లోకూడ, నాయనా ఎను చెప్పలేనని మరియొకసారి పలికినది. వేదమునందు అనేకమయిన చోటులందు పునరుక్తి (చెప్పినదియే తిరిగి చెప్పుట) ఉండును. ప్రయోజనకారి కానిపునరుక్తి వేదమునందుండదు. అచ్చట మన మాగి, వేదమా మాటను తిరిగి ఎందుకు చెప్పినదో విచారించుకొనవలయును. భావించవలెను. అనగా తపస్సులోనికి పోవలెను. ఆ తపస్సులో, ఆ భావనలో, మనలోనుండి, మనకే దాని ప్రయోజనము స్ఫురించును. ఆ యర్థము ప్రకాశ వంతమగును. వృషభము సత్యకామునకు చెప్పినదిదియే. అదియే బ్రహ్మపదార్థము యొక్క లక్షణము. దారి తెలియని చోట ఏ దిక్కున కేగవలెనో ప్రకాశింపజేయును. జబాలాదేవి పునరుక్తమైన వాక్యమును గూర్చివిచారించినచో, మాతృత్వమెంత పవిత్రమైనదో, దానిని సక్రమముగా నిర్వహించుటకెంతటి దీక్ష కావలెనో విదితమగుచున్నది. తల్లి సత్సంతానార్థమై తన మూడు దేహముల యందును ఉన్న శక్తులను, తానెంత ఉన్నతస్థాయికి కొని పోగలదో, అంత వరకు కొనిపోవలయును. అది ఆమె ధర్మము. తాను తన తల్లిధర్మమును సంపూర్ణముగ నిర్వహింపలేదేమో అనిన విచారమామె ప్రసంగమున వేదము విదితము జేసినది.

కుమారుడు గోత్రమడుగగా, తల్లి తెలియదనుటతో సమాధానము పూర్తి అయినది. కాని తల్లి అంతటితో ఆగలేదు. నేను జబాలాదేవిని. నీవు సత్యకాముడవు. అందువలన సత్యకామజాబాలుడని చెప్పుకొనుమనినది. ఇది సత్యము. అనగా జరిగినది. ఆమె జబాలాదేవిగా నుద్భవించుటకు, సత్యకాముడనిన పుత్రుని బడయుటకు, సర్వకార్యకర్త అయిన బ్రహ్మము కారణము. ఆ జరిగిన సంఘటనను, మన ఇచ్చవచ్చినట్లు మార్చుట, ఆ బ్రహ్మమును కాదనుట. బ్రహ్మ కర్తృత్వము నంగీకరించక పోవుట. ఆ సర్వకార్యకారణ శక్తియందు నమ్మిక లేకపోవుట. కావున ఈ సృష్టియందు జరిగిన, జరుగుచున్న సర్వ సంఘటనలను యథాతథముగా స్వీకరించుట, పలుకుట – సత్యవ్రతముగా నుండుటయే బ్రహ్మ భావమునంగీకరించుట. సత్యకాముడు తల్లిచెప్పినమాటను యథాతథముగ గురువునకు చెప్పెను. గురువు నీవు సత్యమును దాటలేదు అనెను. అచ్చట వేదముపయోగించిన శబ్దము న అగాః అనగా దాటిపోవలేదని యర్థము. సత్యము పరిధి (Circumference) బ్రహ్మభావమా పరిధి కేంద్రము (Center) మనమా పరిధిని దాటినచో, బ్రహ్మ భావమునకు దూరమగుచున్నాము. సత్యకాముడు, బ్రహ్మభావనకు దూరమవలేదుకనుకనే, గురువు వెంటనే సమిధలను తెప్పించి, దీక్షనిచ్చెను. వేదశబ్దములంత ప్రబోధకరముగా నుండును.

జబాలాదేవి కుమారునకు సత్యమార్గమొక్కటే బ్రహ్మవిద్యా మార్గమని చెప్పినది. తల్లి ఉపదేశము కుమారునకవగాహన మయినదని చెప్పుటకే, గురువు సమక్షమున సత్యకాముని వాక్కుగా తల్లి మాటలు పునరుక్తము లయినవి. వేదమునందు ఒక శబ్దముగాని, వాక్యముగాని, పునరుక్తమయినచో, దానిని గూర్చి మనము భావించి తీరవలయును. ఆహా! ఆ తల్లి ఏమి తల్లి! కుమారునకు గోత్రమీయని పాపమును, బ్రహ్మ విద్యా ప్రాప్తికి నిశ్చయమైన మార్గము జూపి, ఆ పాపమును తుడిచి వేసిన తల్లి! బ్రహ్మ విద్యాభిలాషి అయిన కుమారునకు సంప్రాప్తమైన ఆరువురు గురువులలో మొదటి గురువైన తల్లి!

కథారంభమునుండి గౌతముడు దీక్షనిచ్చువరకు పట్టుమని పది, పదునైదు వాక్యములకన్న ఎక్కువ లేవు. ఈ పదునైదు వాక్యములలో మాతృదేవతా స్వరూపము, స్త్రీ మాతృ దేవతా పీఠము నధిష్ఠించుటకు పూర్వము, నిర్వర్తింపవలసిన ధర్మము, మాతాపుత్రుల మూడు దేహముల సంబంధము, సత్య స్వరూపము, ఆ సత్యమే బ్రహ్మవిద్యాసౌధప్రథమ సోపానమను విషయము, గోత్రము, ఆ జ్ఞానశరీర స్వరూపము,సర్వము విదితమయినవి. ఇది వేదము కథను చెప్పెడి విధానము.